క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన 'బొడ్డేడ'



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: రీసర్వేలో లోపాలను సవరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలి పారు. మండలంలోని జేపీ అగ్రహారంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో నిర్వహించిన రీ-సర్వేలో లోపాలను సవరించడంతో పాటు తేడాలను సరిచేసేందుకు ఇటువంటి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సర్పంచ్ జామి చినమ్మలు, డీటీ పడాల్, పలువురు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజుపేటలో రెవెన్యూ సదస్సు నేడు

మునగపాక: మండలంలోని రాజుపేటలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం ఆవరణలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తూర్పు కాపులకు బీసీడీ, ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

అచ్యుతాపురం: తూర్పు కాపులకు బీసీడీ, ఓబీసీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని తూర్పు కాపు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వెలమశెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో నిర్వహించిన తూర్పు కాపు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే సోమవారం భారీ స్థాయిలో తూర్పు కాపు సంఘం సమావేశం నిర్వహిస్తామని, ఈ సమావేశంలో పలు కమిటీలను నియమిస్తామని వెల్లడించారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న హెచ్‌ఎం

ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారం ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. 2014లో పాఠశాల ప్రహరీ కోసం పిల్లర్స్ వేసి మధ్యలో వదిలేశారు. దీనిపై అప్పట్లో పదేపదే ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రహరీ పనులు ప్రారంభించడంపై హెచ్‌ఎం ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ దీపిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

మునగపాక: సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కోరారు. మునగపాకలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ సభ్యత్వాలు విరివిగా జరిగేలా చూడాలన్నారు. పార్టీ నాయకులు దాడి ముసలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, దాడి శివ, విల్లూరి నరసింగరావు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం..!



దిమిలిలో మైనర్ శారదానది ఒడ్డున ఉన్న చిన్న శ్మశానవాటిక

- మేజర్ పంచాయతీ దిమిలిలో ఆఖరి మజిలీకి తప్పని అవస్థలు
- దూరంగా ఉన్న మైనర్ శారదానది ఒడ్డున అంత్యక్రియలు
- తాగునీటికీ కటకట.. క్షీణించిన పారిశుధ్యం

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలో మేజర్ పంచాయతీ దిమిలి గ్రామం మౌలిక సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. సుమారు 5 వేల జనాభా కలిగిన ఈ పంచాయతీ శ్మశానవాటిక లేదు. గ్రామంలో ఎవరైనా చనిపోతే సమీపంలో ఉన్న మైనర్ శారదానది ఒడ్డున అంత్యక్రియలు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొన్నాయి. మారుమూల పల్లెల్లో సైతం శ్మశానవాటికకు ప్రత్యేకంగా స్థలం ఉంటుంది. దిమిలిలో అటువంటి పరిస్థితి లేదు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో గుండెపోటుతో మృతి చెందిన గ్రామానికి చెందిన జవాన్ అంత్యక్రియలు చేయడానికి శారదానది ఒడ్డుకు తీసుకువచ్చారు. అక్కడ అంత్యక్రియలకు వచ్చిన ఆర్మీ అధికారులు శ్మశానవాటికను చూసి విస్మయం వ్యక్తం చేశారు.

క్షీణించిన పారిశుధ్యం

దిమిలి గ్రామంలో పారిశుధ్యం క్షీణించింది. మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయింది. వర్షాలు పడినప్పుడు వ్యర్థాలు వీధి రోడ్ల మీదకు కొట్టుకు వచ్చి నిలిచిపోతున్నాయి. దుర్గంధం భరించలేక పోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు పలు వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగక అంధకారం రాజ్యమేలుతోంది. మరికొన్ని విధుల్లో పగలు రాత్రులు తేడా లేండా వీధి దీపాలు వెలుగుతున్న పరిస్థితి ఉన్నాయి. వీధి దీపాల నిర్వహణపై పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నారాయణపురం గ్రామం నుంచి దిమిలి గ్రామం వరకు వీధి దీపాలు వెలగడం లేదని, దీంతో రాత్రి పూట అటుగా వెళ్లేటప్పుడు భయమేస్తోందని చెబుతున్నారు. వీధుల్లో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. దోమలు వ్యాప్తి చెంది, రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని దిమిలి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వేధిస్తున్న తాగునీటి సమస్య

పక్క గ్రామమైన సోమలింగపాలెం నుంచి పైపులైన్ ద్వారా దిమిలి గ్రామానికి తాగునీరు సరఫరా అవుతోంది. తరచూ పైపులైన్ మరమ్మతుల కారణంగా మూడు రోజులకు ఒక్కసారి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. మూడు వాటర్ ట్యాంకులతో నీటి సరఫరా అవుతున్నా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. మంచినీటి కోసం పొలాల వద్ద ఉన్న నేల బావులను సైతం ఆశ్రయిస్తున్న పరిస్థితులు ఉన్నాయి.



దిమిలిలో అస్తవ్యస్తంగా ఉన్న కాలువ

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి



రాంబిల్లి మండలంలో మేజర్ పంచాయతీ అయిన దిమిలిలో శ్మశానవాటిక లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చాలా దూరంగా ఉన్న మైనర్ శారదానది ఒడ్డున అంత్యక్రియల నిర్వహణకు ఇబ్బందవుతోంది. జనాభా ప్రాతిపదికన పెద్ద గ్రామమైన దిమిలికి హిందూ శ్మశానవాటిక కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలి.

– కరణం శ్రీహరి, అడ్వకేట్ దిమిలి గ్రామం

ఆఖరి మజిలీకి తప్పని ఇక్కట్లు



చాలా కాలంగా గ్రామంలో శ్మశానవాటిక సమస్య ప్రధానంగా వేధిస్తోంది. ఆఖరి మజిలీకి కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి శ్మశానవాటికకు కేటాయించాలి. తాగునీటి సమస్యతో పాటు పారిశుధ్యం మెరుగుకు కూడా కృషి చేయాలి.

–కొట్టాపు వడ్డి కాసులు, మాజీ సర్పంచ్, దిమిలి గ్రామం

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పాయకరావుపేట: పాయకరావుపేట 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలోని 11కేవీ మంగవరం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు నరికివేతలో భాగంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాయకరావుపేట, పడాలవాని లక్ష్మీపురం, సీతారాంపురం, పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చక్కానగర్ ఫీడర్ పరిధిలో..

పాయకరావుపేట 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలోని 11కేవీ చక్కానగర్ ఫీడర్ పరిధిలో కూడా చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. దొర కాలనీ, శ్రీప్రకాష్ స్కూల్ ఏరియా, నామవరం, పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ మోటార్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రహదారులు ఇలా.. రాకపోకలెలా?



కె.వెంకటాపురం వెళ్లే రహదారిలో పిచ్చిమొక్కలు

కోటవురట్ల: రహదారుల్లో భద్రత కొరవడింది. ఛిద్రమైన గోతులతో పాటు రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చాలా కాలంగా ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు రహదారి నిర్వహణపై చేతులెత్తేశారు. నిధులు లేవంటూ జంగిల్ క్లియరెన్సు జోలికి పోవడంలేదు. దాంతో ఏ గ్రామానికి వెళ్లినా ఏపుగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలే దర్శనమిస్తున్నాయి. అసలే ఇరుకు రోడ్లు కావడంతో బలిసిన పిచ్చిపొదలతో మరింత సన్నబడిపోయాయి. మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. కె.వెంకటాపురం, రాజుపేట, చౌడువాడ, నీలిగుంట గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఈ దుస్థితి ఉంది. మండల పరిషత్ అధికారులైనా స్పందించి ఉపాధి హామీ పథకం ద్వారా తుప్పలు తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

తైక్వాండోలో కుసుమ సత్తా



స్వర్ణ పతకం సాధించిన కుసుమ

యలమంచిలి రూరల్: ఏయూ అంతర కళాశాలల పురుషులు, మహిళల విభాగంలో గత నెల 21న విశాఖలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో యలమంచిలికి చెందిన క్రీడాకారిణి బి.కుసుమ ఉత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించినట్టు తైక్వాండో శిక్షకుడు ఎస్‌వీఎస్ రమేష్ బుధవారం చెప్పారు. యలమంచిలి రాజీవ్ క్రీడా వికాస కేంద్రంలో శిక్షణ పొందిన కుసుమ అంతర్ కళాశాలల పోటీల్లో సత్తా చాటి, ఏయూ జట్టుకు ఎంపికైంది. పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో ఈ నెల 6 నుంచి 15 వరకూ జరిగే అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలకు కుసుమ ప్రాతినిధ్యం వహించనుంది. ఈ మేరకు కోచ్ రమేష్, పలువురు క్రీడాకారులు ఆమెను అభినందించారు.

బీఎల్‌వోలు పారదర్శకంగా పనిచేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు సూచనలిస్తున్న ఈఆర్వో మనోరమ

యలమంచిలి రూరల్: బూత్ లెవెల్ అధికారులు(బీఎల్‌వోలు) ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పారదర్శకంగా విధులు నిర్వహించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి(ఈఆర్వో) కె.మనోరమ సూచించారు. బుధవారం యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన బీఎల్‌వోలతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, పోలింగ్ స్టేషన్ బదిలీ వంటివి జాగ్రత్తగా చేపట్టాలన్నారు. జాబితాలో పేర్ల తొలగింపుల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించకూడదని చెప్పారు. పారదర్శకంగా విధులు నిర్వహిస్తే ఎలాంటి ఆరోపణలు రావన్నారు. ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా బీఎల్‌వోలంతా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. తనిఖీల సమయంలో బీఎల్‌వోలు లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని 100 శాతం విజయవంతం చేయాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందన్నారు. తహసీల్దార్ కె.వరహాలు మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరిన బీఎల్‌వోలు ఏ విధమైన సందేహాలున్నా సంబంధిత అధికారులను సంప్రదించి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ టి.హెచ్.వినయ్ కుమార్, ఎన్నికల డీటీ బాలేశ్వరరావు, ఆర్‌ఐ విష్ణుమూర్తి, 67 మంది బీఎల్వోలు పాల్గొన్నారు.

సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు ప్రారంభం



యలమంచిలి రైల్వేస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌లో సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: పట్టణం, మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బుధవారం నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థుల విద్యాస్థాయిని తెలుసుకునేందుకు ఏటా నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్, రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తారు. అందులో భాగంగా రెండో సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు అన్ని స్కూళ్లలో నిర్వహించారు. రాష్ట్ర విద్యా పరిశోధన మండలి రూపొందించిన ప్రశ్నపత్రంతో ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం జరుగుతున్నాయి. ఒకటి నుంచి ఐదో తరగతి చదివే విద్యార్థులకు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకు ఒక పరీక్ష, 2.20 నుంచి 3.20 గంటల వరకు మరో పరీక్ష నిర్వహించారు. ఇక తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, మళ్లీ 11.15 గంటల నుంచి 12.15 గంటల వరకు పరీక్షలను ఈ నెల 8వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎంఈవో మీనాక్షి తెలిపారు. బుధవారం తెలుగు, గణితం సబ్జెక్టుల పరీక్షలు జరిగాయి.

'పొలం పిలుస్తోంది'తో రైతులకు మేలు



గణపర్తిలో పొలం పిలుస్తోందిలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి



మాసాహేబుపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు



వరి పొలాల్లో ఎలుకల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మోహన్‌రావు

మునగపాక: పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు మేలు చేకూరుస్తుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి తెలిపా రు. మండలంలోని గణపర్తిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పొట్ట దశలో ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తెగుళ్ల సోకకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ-పంట నమోదుపై రైతు లు దృష్టి సారించాలని సూచించారు. ఎంపీటీసీ మారిశెట్టి వెంకటరమణ, వీఏఏ నవ్యశ్రీ, పలువురు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని మాసాహేబుపేట, పెంటకోట గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో సస్య రక్షణ చర్యలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, రైతులు, ఇరిగేషన్ ఏఈ, వివిధ శాఖల అధికారులు, స్థానిక వీఏఏ అజయ్, ఎంపీఈవో సతీష్ పాల్గొన్నారు.

వరి పొలాల్లో ఎలుకల నివారణపై అవగాహన

యలమంచిలి రూరల్: మండలంలోని రామారాయుడుపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏవో పొలిమేర మోహన్‌రావు ఆధ్వర్యంలో ఎలుకల నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ సంవత్సరం వరి పొలాల్లో ఎలుకల సంచారం ఎక్కువగా ఉందని, రైతులు పొలం గట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని గడ్డి లేకుండా చూసుకోవాలని సూచించారు. గట్ల మీద రంధ్రాలు గుర్తించి, వాటిని పూడ్చి వేయాలన్నారు. రంధ్రాలు, ఎలుకలు ఎక్కువగా ఉన్నట్టయితే, అల్యూమినియం టాబ్లెట్లు, బ్రమోడియోలిన్ టాబ్లెట్లు ఎకరానికి 50 నుంచి 60 వరకూ వేయాలని సూచించారు. వరి పొట్ట దశకు చేరుకుంటుందని, పొటాష్ ఎరువు వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గొర్లె బాబూరావు, సిద్దిళ్ల అప్పారావు, గొర్లె మురళి, మోహన్‌రావు, అరుణ, నూకినాయుడు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

4 కిలోల గంజాయి పట్టివేత

కోటవురట్ల: గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యండపల్లి జంక్షన్‌లో బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేస్తుండగా బైక్‌పై ముగ్గురు యువకులు గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 4 కిలోల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ముప్వల శ్రీను జి.మాడుగులకు చెందిన యువకుడు కాగా సాయి ప్రవీణ్, నిఖిల్ అనే ఇద్దరు వ్యక్తులు తెలంగాణా ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

జిల్లా స్థాయి కబడ్డీ విజేత వాడ్రాపల్లి జట్టు



కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి నరసింగరావు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. వాడ్రాపల్లికి చెందిన శ్రీ న్యూ వెంకటేశ్వర జట్టు ప్రథమ, కొండకర్లకు చెందిన ప్రభాష్ టీమ్ ద్వితీయ, మునగపాక శ్రీనివాస టీమ్‌కు తృతీయ, గౌరీయూత్ వాడ్రాపల్లి జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. నాగులచవితి సందర్భంగా కబడ్డీ కుర్రాళ్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి నరసింగరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులున్నారని, వారిని ప్రోత్సహించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఓటమిని సవాల్‌గా తీసుకొని గెలుపుకోసం శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మళ్ల శేషు, పెతకంశెట్టి లీలా భాస్కరరావు, సూరిశెట్టి శివ, ఎర్రవరపు ప్రసాద్, కొయిలాడ రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహాద్భుతం.. వాడ్రాపల్లి శివలింగం



స్వయంభూ శివలింగం



వాడ్రాపల్లిలోని దక్షిణేశ్వరుని ఆలయం



కళకళలాడుతున్న వాడ్రాపల్లి ఆవ

మునగపాక: కార్తీక మాసం వచ్చిందంటే చాలు భక్తులు వాడ్రాపల్లి దక్షిణేశ్వర స్వామిని దర్శించుకోవాలని పరితపిస్తారు. స్వయంభూ దక్షిణ కాశీ విశ్వేశ్వర ఆలయంగా దీనికెంతో ప్రసిద్ధి. ఈ ఆలయంలో శివలింగం దక్షిణ ముఖంగా ఉండడంతో దక్షిణేశ్వరుని ఆలయంగా పేరొందింది. ఇక్కడి పంట పొలాల్లో పూర్వం భారీ శివలింగం బయటపడింది. దీనిని పెకిలించి అనకాపల్లి తీసుకువెళ్లి ప్రతిష్టించేందుకు కొంతమంది వర్తకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో చేసేది లేక ఆలయాన్ని ఇక్కడే నిర్మించారు. స్పటిక ఆకారంలో ఉండే శివలింగం దక్షిణ భారతదేశంలో ఉన్న దేవాలయాల కన్నా పెద్దదని పూర్వీకులు చెబుతారు. కార్తీకమాసంలోని ఆది, సోమవారాల్లో వేలాది మంది భక్తులు వచ్చి దక్షిణేశ్వరున్ని దర్శించుకొని వనభోజనాలు చేసి, ఉత్సాహంగా గడుపుతారు. ఈ ఆలయం ఉన్న పొలాలు సూరిశెట్టి అప్పలనాయుడుకు చెందినవి. ఆలయాన్ని అప్పలనాయుడు కుమారుడు పరమేశ్వరరావు అభివృద్ధి చేసి ప్రస్తుతం ఆలయ ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు.

ఆకట్టుకునే వాడ్రాపల్లి ఆవ

చుట్టూ పచ్చని చెట్లు.. ఎత్తయిన కొండలు.. ముచ్చటగొలిపే పక్షుల కిలకిలరావాలు.. నీటిలో తేలియాడే తామరపువ్వులు.. వాడ్రాపల్లి ఆవను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఆవలోని నీటిలో శివలింగం అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ శివ లింగాన్ని తాకితే కోరిన కోర్కెలు నెరవేరుతాయన్న నమ్మకం భక్తుల్లో ఉంది. అలాగే ఆవలోని బోటు షికారు మధురానుభూతిని కలిగిస్తుంది. వాడ్రాపల్లి ఆవను చేరుకోవాలంటే అనకాపల్లి నుంచి బస్సులో లేదా ఆటోలో వచ్చి మునగపాకలో దిగాలి. అక్కడి నుంచి మూడు కిలోమీటర్ల మేర ఆవకు చేరుకునేందుకు ఆటోలు అందుబాటులో ఉంటాయి. గాజువాక-ఆచ్యుతాపురం మార్గంలో నాగవరంలో దిగి అక్కడి నుంచి కూడా ఆటోలో ఆవను చేరుకోవచ్చు.

పోలీసుల అదుపులో వైఎస్సార్ సీపీ నాయకులు



కోటవురట్ల పోలీసు స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు

కోటవురట్ల: పోలీసుల తీరును నిరసిస్తూ బుధవారం శాంతియుత ధర్నా చేపట్టిన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపు మేరకు నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు కదిలాయి. దీక్షను అడ్డుకునేందుకు పోలీసులు చేపట్టిన చర్యలలో భాగంగా పలు ప్రాంతాలలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదపులోకి తీసుకున్నారు. నర్సీపట్నంలోని పలు ప్రాంతాలలో అదపులోకి తీసుకున్న 20 మంది నాయకులను కోటవురట్ల పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచి విడుదల చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా ధర్నా చేస్తుండగా పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం దారుణమని ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా సాగుతున్న 'రిమ్‌జిమ్'





పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

పాయకరావుపేట: శ్రీప్రకాష్ విద్యా సంస్థలో నిర్వహిస్తున్న రిమ్‌జిమ్-2024 పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. తుని, పాయకరావుపేట, అన్నవరంలోని శ్రీప్రకాష్ శాఖల విద్యార్థులు సుమారు 4,500 మంది ఈ పాల్గొని ప్రతిభ కనబరుస్తున్నారు. సాహిత్యం, సంగీతం, క్రీడలు, లలిత కళలు, థియేటర్స్ ఆర్ట్స్, సైన్స్ వంటి అనేక అంశాలపై జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలలో 29 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. రిమ్‌జిమ్ ముగింపు కార్యక్రమం ఈ నెల 9న జరుగుతుందన్నారు. విద్యార్థులకు బుధవారం పలు పోటీలు నిర్వహించారు.